ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
మంగళవారం 10 సెప్టెంబరు 2024

పెద్దాపూర్ గురుకులంలో పూర్తి స్థాయిలో తరగతులు ప్రారంభం 7లో..

వినాయక మండపాల వద్ద ప్రత్యేక పూజలు 8లో..

నిండుకుండలా శ్రీరాంసాగర్



- ఆయకట్టు రైతుల్లో ఆనందం
- ఇప్పటికే రెండు పర్యాయాలు గేట్లు తెరిచి దిగువకు నీరు
- కాకతీయ కాలువ, వరద కాలువలకు పుష్కలంగా నీరు
- సాగు, తాగు నీటి కష్టాలు లేనట్లే..

జగిత్యాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉత్తర తెలంగాణ వర ప్రదాయిని.. ఉమ్మడి అయిదు జిల్లాల అన్నదాతల కల్పతరువుగా పేరొందిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిండు కుండలా మారింది. ఎగువ ప్రాంతమైన మహారాష్ట్రలో భారీ వర్షాలు కురుస్తుండడంతో ప్రాజెక్టులోకి వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు చెందిన గేట్లను పైకి ఎత్తి దిగువ గోదావరిలోకి నీటిని వదులుతున్నారు. ప్రస్తుత సీజన్‌లో ఇప్పటికే రెండు పర్యాయాలు గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలారు. కాకతీయ కాలువ, వరద కాలువలకు పుష్కలంగా నీరు విడుదల చేస్తున్నారు. దీంతో రానున్న రోజుల్లో సాగు, తాగునీటికి ఇబ్బందులు దూరం కానున్నయన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని వరద కాలువ, కాకతీయ కాలువతో పాటు పలు పథకాల కింద రెండు పంటలకు సాగు నీరు అందనుంది.

ఆగస్టులో స్వల్పం.. సెప్టెంబరులో అధికం...

ఈ యేడాది ఆగస్టు వరకు ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో ప్రాజెక్టులోకి స్వల్పంగానే వరద వచ్చింది. వారం, పది రోజులుగా కురుస్తున్న వానలతో ప్రాజెక్టు ఎప్పుడు నిండుతుందా అన్న ఎదురు చూపులకు తెరపడింది. ప్రాజెక్టులోకి సెప్టెంబరులో భారీగా వరద చేరి నిండడంతో పాటు మిగులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో రైతులు, మత్స్యకారులు, ప్రజల్లో సంతోషం వ్యక్తం అవుతోంది.

అయిదేళ్లుగా విడుదల..

అయిదేళ్లుగా వానాకాలంలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి భారీగా వరద చేరడంతో మిగులు నీటిని విడుదల చేశారు. 2022 సంవత్సరంలో జూలై 10వ తేదీలోపే నిండింది. 2023 సంవత్సరంలో జూలై 27వ తేదీ నుంచి నీటిని గోదావరిలోకి వదిలారు. ప్రస్తుత యేడాది సెప్టెంబరు తొలివారం లోనే రెండు పర్యాయాలు గోదావరిలోకి నీటిని వదిలారు. ఎగువ ప్రాంతం నుంచి జూన్, జూలై, ఆగసట్టు నెలల్లో కలిపి 64.735 టీఎంసీలు వచ్చి ఉంటే.. సెప్టెంబరు మాసంలో భారీగా వచ్చి చేరింది. ప్రాజెక్టులోకి ప్రస్తుత యేడాది జూన్‌లో 3.995 టీఎంసీలు, జూలైలో 27.258 టీఎంసీలు, ఆగస్టులో 33.482 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

మహారాష్ట్ర నుంచి అధికం...

ఎస్సారెస్పీలోకి శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతమైన మహారాష్ట్ర నుంచి అధికంగా వరద నీరు వచ్చి చేరింది. మహారాష్ట్రలోని నాసిక్, నాందేడ్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో వరద వచ్చి చేరుతోంది. బాబ్లీ గేట్లు ఎత్తడం, కామారెడ్డి జిల్లాలోని మంజీర, నిజామాబాద్ జిల్లాలోని గోదావరి పరివాహక ప్రాంతం, నిర్మల్ జిల్లాలోని గడ్డెన్న వాగు నుంచి వరద వస్తున్నట్లుగా అంచనా ఉంది.

జూన్ ఒకటో తేదీ నుంచి...

ప్రస్తుత యేడాది జూన్ ఒకటవ తేదీ నుంచి ఈనెల 9వ తేదీ ఉదయం 6 గంటల వరకు 163.283 టీఎంసీల నీరు వచ్చి చేరింది. అంటే ప్రాజెక్టు నిల్వ సామర్థ్యానికి మించి దాదాపుగా 82.753 టీఎంసీల నీరు అధికంగా వచ్చి చేరింది. ప్రాజెక్టులో అవసరాల మేరకు నిల్వ చేసి..మిగులు నీటిని సుమారు 90.751 టీఎంసీలను సాగునీటి కాలువలు, గోదావరి నది దిగువకు వదిలారు. వరద గేట్ల నుంచి దాదాపుగా 62 టీఎంసీలు వదిలారు. ఈనెల రెండవ తేదీ నుంచి అయిదవ తేదీ వరకు నీటిని విడుదల చేయగా, మరోమారు ఈనెల 7వ తేదీ నుంచి మిగులు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు కింద కాకతీయ, సరస్వతీ, లక్ష్మీ, వరద కాలువలతో పాటు ఎత్తిపోతల పథకాల కింద సుమారు 7.50 లక్షల ఎకరాలకు నీరు అందిస్తున్నారు.

కాకతీయ ప్రధాన కాలువ లైనింగ్ పలు ప్రాంతాల్లో పగుళ్లు తేలింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి జిల్లాలోని ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి, కోరుట్ల, కథలాపూర్, మేడిపల్లి, బీమారం, జగిత్యాల రూరల్, మల్యాల, కొడిమ్యాల మండలాల్లో ప్రవహించే ఈ కాలువలో నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ప్రస్తుతం శ్రీరాంసాగర్ లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో వానాకాలంతో పాటు యాసంగి లోనూ పంటలు సాగయ్యే అవకాశాలున్నాయి. కాకతీయ కాలువ ఉప కాలువలకు తాత్కాలిక మరమ్మతులు చేయకపోవడంతో చివరి ఆయకట్టు వరకు నీరు అందడం ప్రశ్నార్థకంగా మారింది. పలు ప్రాంతాల్లో కాలువ లైనింగ్ దెబ్బతినడం, పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడం, పూడిక తీత చేరుకపోవడం వంటి సమస్యలున్నాయి. ఇదిలా ఉండగా ఎస్సారెస్పీలో పుష్కలంగా నీరు ఉండడంతో గోదావరి తీరంలో ఉన్న ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, రాయికల్ తదితర మండలాల్లో గల ఎత్తిపోతల పథకాల కింద సాగయ్యే పంటలకు నీరందే అవకాశం ఉంది. కానీ ఇందులో కొన్ని పథకాలకు నీరు లేక పనిచేయడం లేదు. మరికొన్ని నిర్వహణ లోపంతో ఉపయోగంలోకి రాకుండా పోయాయి. వీటి మరమ్మతులు చేపడితే దాదాపు మరో పాతిక వేల ఎకరాల వరకు నీరు అందుతుందన్న అంచనా ఉంది. ఈ పనులు పూర్తి చేయించాలని ఎత్తిపోతల పథకాల కింద ఉన్న పంటలు సాగు చేస్తున్న అన్నదాతలు కోరుతున్నారు.

మరమ్మతులు లేక ఆందోళన...

ప్రాజెక్టులో ప్రస్తుతం నీటి పరిస్థితి..

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి ఇన్‌ఫ్లో వస్తోంది. ఎస్సారెస్పీలోకి 42,157 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.053 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వరద గేట్లు ఎత్తడం, మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు ప్రాజెక్టు నుంచి 42,157 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

వరద కాలువ, కాకతీయ కాలువల ద్వారా..

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద పెరుగుతుండడంతో వరద కాలువ, కాకతీయ కాలువ ద్వారా అధికారులు నీటిని విడుదల చేస్తున్నారు. వరద కాలువకు మొదట రెండు వేల క్యూసెక్కుల నుంచి పెంచి చివరకు 20 వేల క్యూసెక్కుల నీటి విడుదల పెంచి వదులుతున్నారు. కాకతీయ కాలువ ద్వారా సుమారు 4 వేల నుంచి 5 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



కాకతీయ కాలువ

ప్రజావాణి సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ సత్య ప్రసాద్



ప్రజావాణిలో వినతిపత్రాలను స్వీకరిస్తున్న కలెక్టర్ సత్య ప్రసాద్

జగిత్యాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి సమస్యలను అధికారులు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సత్య ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో గల ఆడిటోరియంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి కలెక్టర్ హాజరై జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 61 దరఖాస్తులను స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు ఆన్‌లైన్‌లోని తమ తమ లాగిన్‌లో గల ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించి నివేదిక అందించాలన్నారు. వ్యయ ప్రయాలకు ఓర్చుకొని పలువురు బాధితులు జిల్లాకేంద్రానికి వచ్చి ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పిస్తున్నారని తెలిపారు. సమస్యలు పరిష్కరించకుంటే నిరుత్సాహానికి గురికావడంతో పాటు పలు ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. ప్రజలకు ప్రభుత్వంపై భరోసా కల్పించే విధంగా చర్యలు తీసుకొని సమాచారం తెలియజేయాలని ఆదేశించారు. శాశ్వత పరిష్కార దిశగా జవాబు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ గౌతమ్ రెడ్డి, జగిత్యాల, కోరుట్ల ఆర్‌డీవోలు మధుసూదన్, ఆనంద్ కుమార్, కలెక్టరేట్ ఏవో హన్మంత రావు, డీపీవో రఘువరన్‌లతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో తొమ్మిది మంది తహసీల్దార్ల బదిలీలు

ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

జగిత్యాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పదోన్నతి పొందిన పలువురు నాయబ్ తహసీల్ధార్లకు తహసీల్ధార్లుగా పోస్టింగ్‌లను ఇస్తూ సోమవారం కలెక్టర్ సత్య ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. నిజామాబాద్ జిల్లా నుంచి పదోన్నతిపై వచ్చిన వి. వినోద్‌కు కథలాపూర్ తహసీల్ధార్‌గా, కొమురం భీం అసిఫాబాద్ జిల్లా నుంచి పదోన్నతిపై వచ్చిన బి రవీందర్‌కు పెగడపల్లి తహసీల్ధార్‌గా పోస్టింగ్ ఇచ్చారు. అదేవిదంగా కథలాపూర్ తహసీల్ధార్ ఎంకే ముంతాజిబోద్దిన్‌ను బీర్‌పూర్ తహసీల్ధార్‌గా, జగిత్యాల అర్బన్ తహసీల్ధార్ కె వరందన్ సారంగపూర్ తహసీల్ధార్‌గా, సారంగపూర్ తహసీల్ధార్ జి రమేశ్‌ను కొడిమ్యాల తహసీల్ధార్‌గా, బీర్‌పూర్ తహసీల్ధార్ ఎ శ్రీనివాస్‌ను జగిత్యాల రూరల్ తహసీల్ధార్‌గా, కొడిమ్యాల తహసీల్ధార్ రాజమణిని కోరుట్ల రెవెన్యూ డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా, జగిత్యాల రూరల్ తహసీల్ధార్ సి రామ్ మోహన్‌ను జగిత్యాల అర్బన్ తహసీల్ధార్‌గా, పెగడపల్లి తహసీల్ధార్ ఆర్ శ్రీనివాస్‌ను మెట్‌పల్లి తహసీల్ధార్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

చెట్లను నరికిన వ్యక్తుల బైండోవర్

కొడిమ్యాల, సెప్టెంబరు 9 : మండలంలోని దమ్మయ్యపేట అడవిలో అక్రమంగా చెట్లను నరికిన అదే గ్రామానికి చెందిన ఏడుగురు వ్యక్తులను సోమవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు కొడిమ్యాల ఫారెస్ట్ రేంజర్ మొయినుద్దీన్ తెలిపారు. ఆయన వెంట డీఎఫ్ఆర్వో ముషీర్ అహ్మద్, బీట్ అధికారి ఆనందరావు ఉన్నారు. తెలిపారు.

కరోనా వ్యాధిని ఆరోగ్యశ్రీలో ఎందుకు చేర్చలేదు

కొప్పుల ఈశ్వర్‌కు ప్రభుత్వ విప్ ప్రశ్న



సమావేశంలో మాట్లాడుతున్న విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, సెప్టెంబరు 9: బీఆర్ఎస్ ప్రభుత్వం కరోనా వ్యాధిని ఆరోగ్యశ్రీలో చేర్చకుండా ఎందుకు గాలికి వదిలేసిందని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రశ్నించారు. ధర్మపురి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ప్రాంతానికి చెందిన కరోనా బాధితులను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదుకున్నాడో చెప్పాలని డిమాండ్ చేశారు. మాతా శిశు సంరక్షణ ఆసుపత్రిని ప్రజలకు ఎందుకు అందుబాటులోకి తీసుక రాలేదన్నారు. జ్వరాలు ప్రబలకుండా అధికారులు అన్ని రకాల చర్యలు తీసు కుంటున్నారని ఆయన తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి వైద్య రంగంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. కొప్పుల ఈశ్వర్ చేసిన ఆరోపణలు ఖండిస్తున్నామన్నారు. కరోనా వస్తే ప్రజలను గాలికి వదిలేయలేదని, ధర్మపురిలో మాతా శిశు సంరక్షణ పనులు 80 శాతం పూర్తి చేసి 20 శాతం పెండింగ్‌లో ఎందుకు ఉన్నాయని ప్రశ్నించారు. గతంలో సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న కొప్పుల ఈశ్వర్ పెద్దాపూర్ సంక్షేమ హాస్టల్‌కు ఎందుకు వెళ్లలేదన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు జక్కు రవీందర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, వెల్గటూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు తాటిపర్తి శైలేందర్‌రెడ్డి, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సింహరాజు ప్రసాద్ పాల్గొన్నారు.

ఉద్యమమే ఊపిరిగా జీవించిన కవి కాళోజీ

కలెక్టర్ సత్య ప్రసాద్

జగిత్యాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉద్యమమే ఊపిరిగా జీవించిన ప్రజా కవి కాళోజీ నారాయణరావు అని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. సోమవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజా కవి, పద్మవిభూషన్ కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను నిర్వహించారు. కాళోజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ భాషకు అస్తిత్వ స్పృహ ను పెంచడంలో కాళోజీ కీలకపాత్ర వహించారని కొనియాడారు. ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం పద్మ విభూషణ్ బిరుదుతో గౌరవించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కాళోజీ పుట్టిన రోజును తెలంగాణ భాషా దినోత్సవంగా ప్రకటించి అధికారికంగా జయంతి వేడుకలను నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, కలెక్టరేట్ కార్యాలయ ఏవో హన్మంత రావు, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సాయిబాబా, జిల్లా పంచాయతీ అధికారి రఘువరన్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కళాశ్రీ సాహితీ వేదిక ఆధ్వర్యంలో...

పట్టణంలోని కళాశ్రీ సాహితీ వేధిక ఆధ్వర్యంలో సోమవారం ప్రజాకవి కాళోజీ నారాయణ రావు జయంతి వేడుకలను నిర్వహించారు. కాళోజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కాళోజీ అందించిన సాహితీ సేవలను కొనియాడారు. ఈకార్యక్రమంలో కళాశ్రీ సాహితీ వేదిక అధినేత కళాశ్రీ గుండెటి రాజు, కళాకారులు డాక్టర్ శ్యామ్ సుందర్, ఒడెల గంగాధర్, లక్కా రాజు, శ్రీ లక్ష్మీ, ములస్థం లావణ్య, సరళ, కమల పాల్గొన్నారు.

- పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం కాళోజీ నారాయణ రావు జయంతి వేడుకలను నిర్వహించారు. కాళోజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వంచే ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని పొందిన కళాశాలకు చెందిన అధ్యాపకులు డాక్టర్ తత్వాది ప్రమోద్ కుమార్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కల్వకుంట్ల రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ చంద్రయ్య, తెలుగు విభాగం అధ్యక్షుడు డాక్టర్ ప్రమోద్ కుమార్, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ సంగీతా రాణి, అధ్యాపకులు డాక్టర్ వర ప్రసాద్, డాక్టర్ వాసవి, రహీం, రామచంద్రం, సుజాత, నీరజ, డాక్టర్ జమున, సునీత, జ్యోత్స్న, వెంకట సాయి పాల్గొన్నారు.

ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో...

పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సోమవారం కాళోజీ జయంతి వేడుకలు జరిపారు. కాళోజీ యంతి సందర్భంగా తెలంగాణ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. కాళోజీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగాం అధికారి కొట్టాల తిరుపతిరెడ్డి, అధ్యాపకులు సునీత, శ్రీలత, శిల్పమాదవి, సుమేర, జగన్, మజీద్, ఇష్తికార్, స్వరూప, ప్రియాంక తపాల్గొన్నారు.

మెట్‌పల్లి(ఇబ్రహీంపట్నం) : పట్టణంలో సోమవారం కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మెట్‌పల్లి న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో బార్ అధ్యక్షులు పుప్పాల లింబాద్రి నారయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక తెలంగాణ రావడానికి ఆయన స్ఫూర్తి ప్రదాతగా నిలిచిడాన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షులు రాంబాబు, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, న్యాయవాదులు కోటగిరి వెంకటస్వామి, నర్సయ్య, శ్రీనివాస్, శేఖర్, సత్యం. గంగాధర్ పాల్గొన్నారు.



కాళోజీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్, ఇతరులు

కథలాపూర్ : తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కాళోజీ నారా యణరావు జయంతి మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ నారాయణ, అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.

తిప్పన్నపేటలో అధ్వానంగా పారిశుధ్యం

- ప్రబలుతున్న జ్వరాలు
- నాలుగురోజుల వ్యవధిలో నలుగురు మృతి



తిప్పన్నపేటలో రోడ్డు పక్కన ప్రవహిస్తున్న మురుగు నీరు

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 9 : జగిత్యాల మండలం తిప్పన్నపేటలో ఏ వీధిలో చూసినా ప్రజలు ఒళ్లునొప్పులు, విషజ్వరంతో బాధపడుతున్న బాధితులే కనిపిస్తున్నారు. చాలా మంది వైద్యం కోసం సమీప ఆర్ఎంపీ, పీఎంపీల వద్దకు పరుగెడుతున్నారు. తిప్పన్నపేటలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారడం కూడా జ్వర తీవ్రతకు ఒక కారణంగా భావిస్తున్నారు. పారిశుధ్యం లోపించడంతో దోమలు స్వైరవిహారం చేస్తు న్నాయని పంచాయతీ అధికారులు శానిటేషన్ చేస్తున్నా పరిస్థితి అదుపులోకి రావడం లేదు. గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించకపోవడం, ఎంఎల్ హెచ్‌పీ అందుబాటులో లేక సరైన వైద్యసేవలు అందడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఒళ్లునొప్పులతో ఇంటి కొకరు బాధపడుతున్నారు. వీరికి వైద్య పరీక్షలు నిర్వహిస్తూ వైరల్ ఫీవర్‌గా నిర్ధారిస్తున్నారు. తిప్పన్నపేట గ్రామంలో నాలుగు రోజుల వ్యవధిలో నలుగురు విషజ్వరాలతో మృతి చెందడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. తిప్పన్నపేట గ్రామ పంచాయతీ పరిధిలో 9 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. తిప్పన్నపేట ఆరోగ్య ఉపకేంద్రంలో 1 ఎంఎల్ హెచ్‌పీ, ఏఎన్ఎం ఇద్దరు, ఆశవర్కర్లు ముగ్గురు విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఎంఎల్‌హెచ్‌పీగా పనిచేస్తున్న ఉద్యోగిని కల్లెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బదిలీ చేయడంతో సరైన వైద్యసేవలు అందడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి జ్వరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పారిశుధ్య నిర్వహణ లేకనే విషజ్వరాలు

చిత్తారి ప్రభాకర్, తిప్పన్నపేట



జగిత్యాల మండలం తిప్పన్నపేట గ్రామంలో పారిశుధ్య నిర్వహణ సరిగా లేదు. ఆరోగ్య ఉపకేంద్రంలో వైద్య సిబ్బంది కొరత ఏర్పడింది. ఆరోగ్యకేంద్రంలో పనిచేస్తున్న ఎంఎల్ హెచ్‌పీని కల్లెడకు బదిలీ చేయడంతో వైద్యసేవలు అందడంలేదు. వర్షకాలం ప్రారంభమైననాటి నుంచి గ్రామంలో ఫాగింగ్ చేయలేదు. దీంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. అధికారులు స్పందించి విషజ్వరాలు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి.

జ్వరాలు ప్రబలకుండా చర్యలు

జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్



తిప్పన్నపేట గ్రామంలో విషజ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకుంటాం. గ్రామంలో వైద్యశిబిరాలు, ఫీవర్‌సర్వే, లార్వా సర్వేలు చేపడుతాం. ఫాగింగ్ తోపాటు ఇంటింటా స్ప్రే నిర్వహిస్తాం. ఇప్పటివరకు గ్రామంలో డెంగీతో ఎవరు మృతి చెందలేదు. వేర్వేరు కారణాలతో మృతిచెందినట్లు తమ దృష్టికి వచ్చింది. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాం. గ్రామంలో ప్రజలు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.

ప్రాజెక్టుల్లో పూర్తిస్థాయి నీటి నిల్వలు

ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులు పూర్తిస్థాయి నీటి నిల్వలకు చేరువలో ఉన్నాయి. ప్రాజెక్టుల్లోకి ఇన్‌ఫ్లో కొనసాగుతుండడంతో నీటి పారుదల శాఖ అధికారులు పరిస్థితినిబట్టి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీరాంసాగర్, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజక్టుల వరద గేట్ల నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. మిడ్‌మానేరు ప్రాజెక్టు నుంచి ఎల్‌ఎండీకి, అన్నపూర్ణ రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. ఎల్‌ఎండీ నుంచి కాకతీయ కాలువ ద్వారా ఆదివారం దిగువకు నీటిని విడుదల చేసిన అధికారులు సోమవారం నిలిపివేశారు.

జగిత్యాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం 42,157 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.053 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి 42,157 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. అయిదు వరద గేట్ల ద్వారా 15,620 క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 4,000 క్యూసెక్కులు, వరద కాలువకు 18,000 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తికి 4,000 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. 666 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది.

● పెద్దపల్లి: పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో పాటు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి 1,23,094 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. దీంతో అధికారులు సోమవారం 20 గేట్లు ఎత్తి 1,07,650 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలిపెట్టారు. శనివారం రాత్రి వరకు ప్రాజెకు పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరువలో ఉండడంతో పైనుంచి వరద నీటిని అంచనా వేస్తూ శ్రీపాద ఎల్లంపల్లి గేట్లను ఎత్తి గోదావరిలోకి వదిలి పెడుతున్నారు. ప్రాజెక్టుపూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 18.702 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.


నిండు కుండలా ఎల్‌ఎండీ

● బోయినపల్లి: శ్రీ రాజరాజేశ్వర (మిడ్ మానేరు) ప్రాజెక్టులోకి 15925 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ఇందులో ఎస్సారెస్పీ నుంచి 13,400, మూలవాగు, మానేరు వాగు ద్వారా 2,525 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ఎల్‌ఎండీ ప్రాజెక్టుకు ఆరు గేట్ల ద్వారా 10,300, అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్ల గాను ప్రస్తుతం 316.17 ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు ప్రస్తుతం 23.03టీఎంసీల నీరు ఉంది.

● తిమ్మాపూర్: కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయం నుంచి కాకతీయ కాలువ ద్వారా ఆదివారం దిగువకు వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేసిన ఇరిగేషన్ అధికారులు సోమవారం మధ్యాహ్నం నిలిపివేశారు. అన్ని చోట్ల విరివిగా వర్షాలు కురుస్తుండడం, వాగులు, కుంటలు, చెరువులు పొంగి పొర్లుతుండడంతో నీటి విడుదలను నిలిపివేసినట్లు తెలిసింది. మిడ్ మానేరు నుంచి వచ్చే నీరు 10 వేల క్యూసెక్కులకు తగ్గింది ఎల్‌ఎండీ పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 24.034 టీఎంసీలు కాగా సోమవారం రాత్రి వరకు 22.824 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మోయతుమ్మెద వాగు నుంచి 623 క్యూసెక్కులు, ఎంఎంఆర్ నుంచి 10,300, ఎగువ నుంచి 1,050 క్యూసెక్కులు మొత్తం 11,973 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఎల్‌ఎండీలోకి వస్తోంది. మిషన్ భగీరథ, నీటి ఆవిరి రూపంలో 305 క్యూసెక్కుల నీరు ఆవుట్ ఫ్లో వెళుతున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

వినాయక మండపాల్లో చోరీ

తిమ్మాపూర్, సెప్టెంబరు 9: మండలంలోని మహాత్మానగర్ ఎల్‌ఎండీ కాలనీలోని రెండు వినాయక మండపాల్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. వేంకటేశ్వర ఆలయ కల్యాణ మండపం అవరణలోని హోమశాలలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వినాయకుడిని ప్రతిష్ఠించారు. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హోమశాల తాళం పగలగొట్టి వినాయకుడికి భక్తులు వేసిన కరెన్సీ దండతోపాటు విగ్రహం వద్ద ఉన్న డబ్బులను ఎత్తుకెళ్లారు. ఆలయంలోని లాకర్‌ను పగలగొట్టేందుకు యత్నించారు. హ్యాండిల్ విరిగిపోవడంతో వెళ్లిపోయారు. శివాలయం అవరణలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలోకి దొంగలు చొరబడి వినాయకుడికి తొడిగిన రాగి తొండంను ఎత్తుకెళ్లారు. ఈ విషయంపై ఎల్‌ఎండీ పోలీసులకు సమాచారం అందించినట్లు మండపాల నిర్వాహకులు తెలిపారు.

'ఎస్సీ సంక్షేమ హాస్టళ్లను ప్రారంభించాలి'

గణేశ్‌నగర్, సెప్టెంబరు 9: ఎస్సీ ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లను ప్రారంభించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్‌ఎఫ్‌ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో ఎస్సీ సంక్షేమ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ శ్రవణ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ నగర అధ్యక్షుడు ఎల్కటూరి ఇషక్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో మూడు ఎస్సీ సంక్షేమ ప్రభుత్వ హాస్టల్స్ మంజూరయ్యాయన్నారు. వాటిని ప్రారంభించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, వాటిని వెంటనే ప్రారంభించాలని ఆయన కోరారు. ప్రభుత్వం మంజూరు చేసినా ఎందుకు ప్రారంభించకుండా కాలం గడుపుతున్నారని ప్రశ్నించారు. జిల్లా వ్యాప్తంగా చాలా మంది విద్యార్థులు హాస్టళ్లలో సీట్లు రాక ఇబ్బంది పడుతున్నారన్నారు. సంక్షేమ హాస్టల్లో సమస్యలను పరిష్కరించాలని కోరారు. అధికారులు స్పందించకపోతే విద్యార్థులను కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యులు గట్టు ఆకాష్, గన్నరపు రాకేష్, అంబాల సందేశ్ తదితరులు పాల్గొన్నారు.

'నష్టపరిహారం ఇప్పించండి'

రామడుగు, సెప్టెంబరు 9: భారీ వర్షాలతో నష్టపోయిన తమకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని మత్స్యకారులు కోరారు. ఈ మేరకు రామడుగు మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ వెంకటలక్ష్మికి సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని షానగర్ ఎల్లమ్మ చెరువు కట్టకు గండిపడిందన్నారు. చెరువులోని చేపలన్నీ కొట్టుకు పోయి పది లక్షల నష్టం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షుడు జిట్టవేణి రాజు, ఉపాధ్యక్షులు రవి, నర్సయ్య, లక్ష్మీపతి, బసరవేని రాజయ్య పాల్గొన్నారు.

తిప్పన్నపేటలో ప్రబలిన జ్వరాలు


తిప్పన్నపేట లో పరీక్షలు చేస్తున్న మాతా శిశు సంరక్షణ అధికారి జైపాల్‌రెడ్డి

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 9: జగిత్యాల మండలం తిప్పన్నపేటలో జ్వరాలు ప్రబలాయి. జ్వరపీడితుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో జగిత్యాల జిల్లా మాత శిశుసంరక్షణ అధికారి డాక్టర్ ముస్కు జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరం ఏర్పాటు చేసి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పలు ఇళ్లను పరిశీలించి జ్వరపీడితుల నుంచి రక్త నమూనాలను సేకరించి పరీక్షలకు పంపారు.

హైడ్రా వల్ల సామన్యులకు ఇబ్బందులు ఉండవు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 9: హైడ్రా వల్ల సామాన్యులకు ఎటువంటి ఇబ్బందులు కలగనీయమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. హైడ్రాపై బీజేపీ నాయకులు నలుగురు నాలుగు రకాలుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీల అమలు సక్రమంగానే జరుగుతుందన్నారు. ప్రతి పక్షాలకు ఏం మాట్లాడాలో తెలియడం లేదన్నారు. ఏదో ఒక స్టేట్‌మెంట్ ఇచ్చి పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. న్యాయ స్థానాలు ఇచ్చే తీర్పులను గౌరవిస్తామన్నారు. ఎమ్మెల్యేల ఫిరాయింపు విషయాన్ని శాసనసభ వ్యవహారాల మంత్రి, అధికారులు చూసుకుంటారని అన్నారు.

'చాకలి ఐలమ్మ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలి'

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 9: తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలని తెలంగాణ రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్ పిలుపునిచ్చారు. సోమవారం కరీంనగర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా కమిటీల ఆధ్వర్యంలో చాకలి వర్ధంతిని ఘనంగా నిర్వహించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శులు వనపర్తి శంకర్, పైడి కొమురయ్య, రాచకొండ నరేశ్, జిల్లా అధ్యక్షుడు పూసాల శ్రీకాంత్, ఉపాధ్యక్షులు నేరెళ్ల లక్ష్మన్, తడిగొప్పుల శ్రీపాల్, కార్యదర్శి మునిగంటి అశ్విన్ పాల్గొన్నారు.

కరీంనగర్‌లోనూ హైడ్రా లాంటి వ్యవస్థ ఏర్పాటు చేయాలి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 9: హైదరాబాద్ తరహాలో కరీంనగర్‌లోనూ హైడ్రా లాంటి వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బి) జిల్లా కార్యదర్శి బండారి శేఖర్ కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కమిటీ సభ్యుడు బెక్కంటి రమేశ్‌తో కలిసి కలెక్టర్‌కు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్‌లో చెరువు శిఖం భూములను, నాళాలు, పార్కులను కబ్జాదారుల నుంచి కాపాడాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో చెరువులు, కుంటలు అదృశ్యం కావడానికి ప్రధాన కారకులు రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపాలిటి అధికారులేనని విమర్శించారు. అధికారుల అండదండలతో కొంతమంది రాజకీయ నాయకులు, కబ్జాదారులు కుమ్మక్కై పెద్దఎత్తున చెరువులు, కుంటలను మాయం చేస్తున్నారన్నారు.

ప్రజల ప్రాణాలతో ఆర్‌ఎఫ్‌సీఎల్ చెలగాటం

● అమ్మోనియా వ్యర్థాలను డ్రైనేజీలు, గోదావరిలోకి వదులుతున్న యాజమాన్యం ● ఏడాదిలో జెడ్‌ఎల్‌డీ పెడతామంటూ పీసీబీకి హామీ ● మూడేళ్లు గడుస్తున్నా ఊసే లేదు

కోల్‌సిటీ, సెప్టెంబరు 9: రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ కాలుష్య నియంత్రణ ప్రమాణాలు పాటించకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోంది. ఆర్‌ఎఫ్‌సీఎల్ ప్లాంట్ నుంచి చుక్క నీరు బయటకు పోదని, వ్యర్థాల ఊసే ఉండదని, ఉత్పత్తికి వినియోగించిన నీటిని శుద్ధి చేసి ప్లాంట్ టౌన్ షిప్‌లో మొక్కల పెంపకానికి వినియోగిస్తామంటూ ప్రజాభిప్రాయ సేకరణ సమావేశంలో ఊదరగొట్టింది. ఏడాదిలో జీరో లిక్విడ్ డిశ్చార్జ్(జెడ్‌ఎల్‌డీ)నిర్మిస్తామని కాలుష్య నియంత్రణ మండలికి హామీపత్రం ఇచ్చింది. ఉత్పత్తి ప్రారంభమై మూడేళ్లు గడుస్తున్నా జెడ్‌ఎల్‌డీ ఊసే లేదు. జెడ్‌ఎల్‌డీ నిర్మించిన తరువాతే ఉత్పత్తి ప్రారంభించాల్సి ఉండగా జెడ్‌ఎల్‌డీ నిర్మాణం లేకుండానే ప్రాజెక్టుకు కాలుష్య నియంత్రణ మండలి కాన్సెంట్ ఆఫ్ ఆపరేషన్ ఇచ్చేసింది. గత ఏడాది రూ.328కోట్ల నికర లాభాలను ఆర్జించిన సంస్థ జెడ్‌ఎల్‌డీకి రూ.170కోట్లు పెట్టేందుకు వెనుకాడుతోంది. జెడ్‌ఎల్‌డీ నిర్మాణానికి ఫిబ్రవరిలో టెండర్లు ఆహ్వానించి తరువాత వదిలేసింది. ప్లాంట్ నుంచి వెలువడే రసాయనిక వ్యర్థాలను నేరుగా గోదావరిలోకి వదులుతున్న సంస్థ తాజాగా లీకేజీ అయిన అమ్మోనియాను నేరుగా మున్సిపల్ డ్రైన్లలోకి వదిలింది. అమ్మోనియా ఘాటుకు వేల మంది జనం ఉక్కిరిబిక్కిరయ్యారు. ఆర్‌ఎఫ్‌సీఎల్ యాజమాన్యం మాత్రం నోరు మెదపడం లేదు.

రామగుండం ఎరువుల కర్మాగారం నిర్మాణ సమయంలో ప్లాంట్‌లో జెడ్‌ఎల్‌డీ పెడతామని, తరువాతే ఉత్పత్తి ప్రారంభిస్తామని ప్రభుత్వానికి ప్రాజెక్టు నివేదిక ఇచ్చింది. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో జనం ఆర్‌ఎఫ్‌సీఎల్ నుంచి వెలువడే వ్యర్థాలపై ఆందోళన వెలిబుచ్చారు. ప్లాంట్‌లో జెడ్‌ఎల్‌డీ పెడతామని, చుక్క నీరు కూడా బయటకు రాదని పేర్కొన్నది. సాధారణంగా చిన్నచిన్న పరిశ్రమల్లో సైతం ఉత్పత్తికి ముందే జెడ్‌ఎల్‌డీ నిర్మాణం జరుగుతుంది. కానీ ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో మాత్రం జెడ్‌ఎల్‌డీ నిర్మాణమే జరుపలేదు. ఆర్‌ఎఫ్‌సీఎల్ నుంచి 2021-22ఆర్థిక సంవత్సరంలో అమ్మోనియా లీకేజీ కావడంతో జనం ఆందోళనకు దిగారు. ఒక సందర్భంలో కాలుష్య నియంత్రణ మండలి ప్లాంట్‌లో ఉత్పత్తి నిలిపి వేయించింది. కేంద్రం జోక్యం చేసుకుంది. ఆ సమయంలో ఏడాదిలో జెడ్‌ఎల్‌డీ నిర్మిస్తామంటూ పీసీబీకి రాతపూర్వక హామీ ఇచ్చింది.


విఠల్‌నగర్ డ్రైనేజీలోఆర్‌ఎఫ్‌సీఎల్ నీరు


వాసన భరించలేక ఇబ్బందులు పడుతున్న విఠల్‌నగర్ వాసులు (ఫైల్)

● జెడ్‌ఎల్‌డీ అంటే...

ఫెర్టిలైజర్స్ ఇండస్ట్రీస్‌లో నీటి కాలుష్యం జరుగుతుంది. ముఖ్యంగా అమ్మోనియా ఉత్పత్తి సమయంలో వ్యర్థాలు వెలువడుతాయి. జెడ్‌ఎల్‌డీ(జీరో లిక్విడ్ డిశ్చార్జి)కి సంబంధించి మూడు స్టేజీల్లో ట్రీట్‌మెంట్ జరుగుతుంది. మొదట వ్యర్థ జలాల నుంచి వ్యర్థాలను తొలగించడం, తరువాత వ్యర్థాలను ఘన రూపంలోకి, ద్రవరూపంలోకి మార్చుతారు. నీటిని పూర్తిగా శుద్ధి చేసి తిరిగి పారిశ్రామిక అవసరాలకు వినియోగించడం లేదా ప్లాంట్లలో గ్రీనరీకి వాడడం చేస్తారు. ఆర్‌ఎఫ్‌సీఎల్ కూడా వ్యర్థ జలాలను శుద్ధి చేసి చెట్ల పెంపకానికి వాడతామంటూ ప్రాజెక్టు రిపోర్టులో పేర్కొన్నది.

● ప్రజలకు, పర్యావరణానికి ముప్పు

ఆర్‌ఎఫ్‌సీఎల్ వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా వదులుతుండడంతో జిల్లాలోని అమ్మోనియా, సోడియం, ఇతర న్యూట్రియన్స్, ప్రమాదకరమైన వ్యర్థాలు అందులో ఉంటున్నాయి. దీంతో గోదావరి జలాలు, సమీప కాల నీల భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయి. రెండు రోజుల క్రితం ప్లాంట్‌లో నుంచి అమ్మోనియా వ్యర్థాలను నేరుగా మున్సిపల్ డ్రైన్‌లో కలుపడంతో రామగుండం నగరంలోని వేలాది మంది ఇబ్బంది పడ్డారు.

● టెండర్లు పిలిచినా ముందుకు సాగని పనులు

ఆర్‌ఎఫ్‌సీఎల్ సంస్థ 2022-23లో రూ.8.59కోట్లు, 2023-24లో రూ.4,941 కోట్ల టర్నోవర్‌తో 328 కోట్ల రూపాయల నికర లాభాన్ని ఆర్జించింది. 170కోట్ల రూపాయల అంచనాలతో జెడ్‌ఎల్‌డీ నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించింది. 180రోజుల్లో టెండర్ల ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది. జూన్‌లో టెండర్ల ప్రక్రియ పూర్తయి నిర్మాణం ప్రారంభించాల్సి ఉంది.

రూ.7,700 పలికిన పత్తి ధర

జమ్మికుంట, సెప్టెంబర్ 9: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,700 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు నలుగురు రైతులు 49క్వింటాళ్ల విడిపత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7,700, కనిష్ఠ ధర రూ.7,650 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

వృథాగా దామెర చెరువు నీరు


దామెర చెరువు తూము నుంచి పోతున్న నీరు

శంకరపట్నం, సెప్టెం బరు 9: శంకరపట్నం మండలం మొలంగూర్ దామెర చెరువు తూము తెరిచి ఉండడంతో చెరువులో నీరు దిగువ కు వృథాగా పోతోంది. చెరువు తూము తెరిచి ఉంచడంతో నీరు దిగు వకు వెళ్లిపోయి వేసవిలో అవసరాలకు నీరు లేకుండా పోతుందని ఆవేదన చెందారు. నీరు దిగువకు పోవడంతో కింద ఉన్న పొలాలు నీట మునిగి పంట నష్టం వాటిల్లుతుందన్నారు. సంబంధిత శాఖాధికారులు వెంటనే స్పందించి తూము ద్వారా నీరు పోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆస్తిలో వాటా కోసం అంత్యక్రియలను అడ్డుకున్న భార్య

● పోలీసులు, పెద్దల జోక్యంతో కార్యక్రమాలు పూర్తి

మంథని, సెప్టెంబర్ 9: భర్త ఆస్తిలో తన కొడుకుకు వాటా కోసం భర్త అంత్యక్రియలను భార్య అడ్డుకున్న సంఘటన పెద్దపల్లి జిల్లా మంథని గోదావరినది తీరంలో సోమవారం జరిగింది. మంథని మండలంలోని విలోచవరం గ్రామానికి చెందిన సురేష్‌కు సంధ్యతో మూడు సంత్సరాల క్రితం వివాహం కాగా వారు హైదరాబాద్‌లో ఉంటున్నారు. వీరికి ఒక కొడుకు ఉన్నాడు. భార్యాభర్తల మధ్య నెలకొన్న కుటుంబ కలహాల కారణంగా సంధ్య కొంత కాలంగా సురేష్‌కు దూరంగా ఉంటోంది. ఈక్రమంలో సురేష్(30) హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదంలో ఆదివారం మృతి చెందాడు. మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం కుటుంబ సభ్యులు మంథని గోదావరి నది తీరానికి తీసుకువచ్చారు. విషయం తెలిసిన భార్య సంధ్య తన కొడుకుతో పాటు మంథని గోదావరినది తీరానికి చేరుకొని భర్త ఆస్తిలో తన కొడుకు వాటా తేల్చాకే అంత్యక్రియలు జరపాలని అడ్డుకున్నారు. భర్త తరుపున కుటుంబ సభ్యులు నచ్చజెప్పినప్పటికీ వినలేదు. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు, ఇరువర్గాలకు చెందిన పెద్ద మనుషులు కర్మకాండలు ముగిశాక ఆస్తి గుర్చించి చర్చిద్దామని నచ్చజెప్పడటంతో అంత్యక్రియలు పూర్తి చేశారు.

జ్వరంతో ఇద్దరి మృతి

వెల్గటూర్, సెప్టెంబరు 9: మండలంలోని స్తంభంపల్లి గ్రామంలో జ్వరంతో బాధపడుతూ అవ్వ లింగమూర్తి (45) అనే వ్యక్తి సోమవారం మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగమూర్తి జ్వరంతో బాధ పడుతూ జగిత్యాల ఆసుపత్రిలో చేరాడు. పరిస్థితి విషమించడంతో కుటుంబీకులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా మృతి చెందాడు.

● ధర్మపురి: జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలోని హనుమాన్ వీధికి చెందిన గజ్జల రామ్ చరణ్(10) అనే 4వ తరగతి విద్యార్థి జ్వరంతో సోమవారం మృతి చెందాడు. రామ్‌చరణ్ వారం రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు స్థానికంగా వైద్యం చేయిస్తున్నారు. అయినా కూడా జ్వర తీవ్రత తగ్గలేదు. వైద్యుల సూచన మేరకు రెండు రోజుల క్రితం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు.

పెద్దాపూర్ గురుకులంలో పూర్తిస్థాయి తరగతులు

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు 9: మండలంలోని పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో నెల రోజుల తరువాత పూర్తి స్థాయిలో తరగతులు ప్రారంభించారు. సోమవారం ఆరు నుంచి ఇంటర్ వరకు తరగతులను ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ మాధవీలత తెలిపారు. పాఠశాలలో వరుసగా జరిగిన సంఘటనలతో తల్లిదండ్రులు భయంతో తమ పిల్లలను నెల రోజుల క్రితం ఇంటికి తీసుకెళ్లారు. తరువాత విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఆన్‌లైన్‌లో తరగతులను నిర్వహించారు. విద్యార్థులకు కావాల్సిన వసతులు కల్పించడానికి సెలవులు ప్రకటించారు. అసంపూర్తిగా ఉన్న నూతన భవనంలో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా వారికి ప్రభుత్వం, సొసైటీ వారి సూచనలతో వసతులు కల్పించడమే కాకుండా కావల్సిన డబుల్ కాట్ బెడ్స్, మౌలిక వసుతులు ఏర్పాటు చేశారు. పూర్తి స్థాయిలో వసతులు కల్పించిన అనంతరం తరగతులను పూర్తి స్థాయిలో ప్రారంభించారు. దీంతో పాఠశాలకు సోమవారం 225 మంది వచ్చారు. మరి కొంత మంది విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చి గురుకుల పాఠశాలను పరిశీలించి సోలార్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారని, మిగతా విద్యార్థులు ఈ నెల 15 నుంచి హాజరవుతారని ఉపాధ్యాయులు తెలిపారు.


పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో తరగతులకు హాజరైన విద్యార్థులు

108లో మహిళ ప్రసవం

● తల్లి, బిడ్డను క్షేమంగా ఆసుపత్రికి తరలించిన సిబ్బంది


108 వాహనంలో జన్మనిచ్చిన తల్లి

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 9: మండలంలోని తుర్కలమద్దికుంట గ్రామానికి చెందిన కలవేన శారద పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు 108కి సమాచారం అందించారు. హుటాహుటిన 108 సిబ్బంది శారద ఇంటికి చేరుకుని వెంటనే పెద్దపల్లి మాతా శిశు ఆసుపత్రికి తరలించే క్రమంలో మహిళకు పురిటినొప్పులు అధికమయ్యాయి. వెంటనే 108 ఎమర్జెన్సీ టెక్నీషియన్ నిమ్మతి శ్రీనివాస్ పైలట్ హబీబ్ సహకారంతో కాల్ సెంటర్ ద్వారా వైద్యుల సలహా మేరకు 108 వాహనంలోనే ప్రసవం చేశారు. కలవేని శారద పండంటి ఆడబిడ్డకు జన్మనివ్వగా తల్లి, బిడ్డను ఆసుపత్రికి తరలించారు. సకాలంలో స్పందించిన 108 సిబ్బందికి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

దళితబంధు రెండో విడత నిధులు మంజూరు చేయాలి

ఇల్లందకుంట, సెప్టెంబరు 9: రాష్ట్ర ప్రభుత్వం దళితబంధు రెండో విడత నిధులను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద సోమవారం దళితబంధు సాధన సమితి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సాధన సమితి నాయకులు మాట్లాడుతూ తొమ్మిది నెలలుగా దళితబంధు నిధుల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పేడచెవిన పెట్టడం సరికాదన్నారు. ఈ మేరకు కోతుల బొమ్మలను ప్రదర్శన చేస్తూ మోకాళ్లపై కూర్చొని వినూతన రీతిలో నిరసన తెలిపారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం హుజూరాబాద్ నియోజకవర్గంలోని మిగిలిన దళితులకు రెండో విడత దళితబంధు నిధులు మంజూరు చేయాలని, లేని యెడల రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సురేష్, రాజేష్, ఆకాష్, బిక్షపతి, రక్షిత్, రాకేష్, సరిత, అర్జున్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న దళితబంధు సాధన సమితి నాయకులు

పాఠశాలలో కంప్యూటర్ దొంగిలించిన వ్యక్తి అరెస్టు

కోనరావుపేట, సెప్టెంబర్9: రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని మామిడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో కంప్యూటర్ దొంగిలించిన వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్లు కోనరావుపేట ఎస్సై రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. పాఠశాలలో కంప్యూటర్ అపహరించారని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మామిడిపల్లి గ్రామానికి చెందిన మాసం దిలీప్‌ను విచారించగా నేరం ఒప్పుకోవడంతో కంప్యూటర్‌ను స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

రైస్‌మిల్లు నిర్మాణానికి అనుమతులు ఇవ్వొద్దు

- ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామస్థుల నిరసన


ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామస్థులు

గొల్లపల్లి, సెప్టెంబరు 9: గొల్లపల్లి మండలం వెంగళాపూర్ గ్రామానికి సమీపంలో బాయిల్డ్ రైస్‌మిల్లు నిర్మిస్తే తమ పంట పొలాలు దెబ్బ తినడమే కాకుండా అనారోగ్యం పాలవుతామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం వెంగళాపూర్ గ్రామానికి చెందిన రైతులు, నాయకులు, యువకులు మండల కేంద్రానికి తరలివచ్చి రైస్‌మిల్లు నిర్మాణానికి అనుమతులు ఇవ్వొద్దు అంటూ తహసీల్దార్ జమీర్, ఎంపీడీవో రాంరెడ్డికి వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ రైస్‌మిల్లు ఏర్పాతో గ్రామంలో వాతావరణ కాలుష్యంతో పాటు పొగ, నల్లని బూడిద రావడంతో అనారోగ్యం పాలవుతామని అన్నారు. కార్యక్రమంలో ఇను గంటి గంగన్న, రేగుంట అంజయ్య, వనపర్తి పెద్దిరాజం, దాసరి నాగేశ్, డెక్క రాజనర్సు, కొండ్ర గంగారెడ్డి, వనపర్తి రాజేందర్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో విద్యార్థినికి గాయాలు

తంగళ్లపల్లి, సెప్టెంబరు 9: రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం మండేపల్లి శివారులోని కేసీఆర్ నగర్ డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయంలో సోమవారం విద్యుదాఘాతంతో విద్యార్థిని గాయపడింది. కేసీఆర్‌నగర్‌కు చెందిన కోలిపాక రాము-రూప దంపతుల కుతూరు లాస్య (7) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో రెండోతరగతి చదువుతోంది. ఎప్పటిలాగే సోమవారం పాఠశాలకు వెళ్లేందుకు సిద్ధమవుతుండగా విద్యుత్ మీటర్లకు అమర్చిన ప్యానల్ బోర్డుకు తగలడంతో విద్యుదాఘాతానికి గురైంది. గమనించిన స్థానికురాలు లాస్యను కాపాడే ప్రయత్నం చేసింది. విద్యుత్ ప్రసారం కావడంతో వదిలేసింది. వెంటనే ఇంట్లో ఉన్న విద్యార్థిని తల్లి రూప కాపాడే ప్రయత్నం చేయగా ఆమె కూడా విద్యుదాఘాతానికి గురైంది. స్థానికులు కర్రసాయంతో ప్యానల్ బోర్డుకు ఉన్న లాస్య చేతిని తొలగించారు. స్పృహ కోల్పోయిన లాస్యను జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించగా ఐసీయూలో చికిత్స పొందుతోంది.

వేములవాడ నుంచి శృంగేరీకి ప్రత్యేక బృందం

సిరిసిల్ల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం విస్తరణ పనులలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో సోమవారం శృంగేరీ పీఠం జగద్గురు భారతీ తీర్థ, పీఠాధిపతి విదుశేఖర భారతి స్వామిని కలవడానికి వేములవాడ నుంచి ప్రత్యేక బృందం వెళ్లింది. ఆలయ విస్తరణ నమూనాలను బృందం సభ్యులు అందించారు. ఆగమ శాస్త్రాన్ని అనుసరించి విస్తరణ చేపట్టేందుకు అనుమతులు కోరారు. నమూనాలను పరిశీలించిన స్వాములు ఆలయ విస్తరణకు ముందుకెళ్లాలని మౌఖిక ఆదేశాలు ఇచ్చారు. త్వరలోనే రాజరాజేశ్వరస్వామి దేవస్థానాన్ని సందర్శించి సూచనలు చేస్తామని తెలిపారు. అనంతరం శృంగేరి పీఠంలోని శారదాంబ అమ్మవారిని ప్రభుత్వ విప్, అధికారుల బృందం సోమవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించింది. శృంగేరి తరలివెళ్లిన వారిలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సీఎంవో ఓఎస్‌డీ వేముల శ్రీనివాసులు, ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, దేవాదాయ స్థపతి వల్లీనాయకం, శృంగేరి పీఠం తెలంగాణ బాధ్యులు రాధాకృష్ణ, రాజన్న ఆలయ ఈఈ రాజేష్, ఆలయ ప్రధాన అర్చకులు నమిలికొండ ఉమేష్‌శర్మ, చంద్రగిరి శరత్ శర్మ, డీఈ రఘునందన్, అసిస్టెంట్ స్థపతి గణేష్, ఇంజనీర్ అసిస్టెంట్ అంజయ్య ఉన్నారు.


ఆలయ అభివృద్ధి పనుల మ్యాప్‌ను పరిశీలిస్తున్న విధుశేఖర భారతిస్వామి

వానాకాలం తిప్పలే!

● ప్రతియేటా పాపయ్యపల్లెకు తప్పని ఇబ్బందులు

శంకరపట్నం, సెప్టెంబరు 9: ప్రతియేటా వర్షాకాలం ఆ గ్రామస్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. వర్షాలు పడితే గ్రామానికి రాకపోకలు నిలిచి ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఏళ్లుగా కోరుతున్నా రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో సోమవారం శంకరపట్నం గ్రామ పంచాయతీ పరిధిలోని పాపయ్యపల్లె గ్రామస్థలు వాగుపై ఉన్న లోలెవల్ బ్రిడ్జిపై నిరసన తెలిపారు. పాపయ్యపల్లె, కేశవపట్నం గ్రామాల మధ్య వాగుపై ఉన్న లోలెవల్ బ్రిడ్జి వర్షాలతో వరద ప్రవాహం పెరిగి రాకపోకలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ వర్షాలు పడితే వాగుపై ఉన్న లోలెవల్ బ్రిడ్జిపై నీరు ప్రవహించడంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచి తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నిత్యం అవసరాల కోసం కేశవపట్నం వెళ్తామన్నారు. ప్రతియేటా వర్షాకాలంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. కొత్త రోడ్డు నిర్మాణం చేపట్టి బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరారు.


లోలెవల్ బ్రిడ్జిపై నిరసన తెలుపుతున్న పాపయ్యపల్లె గ్రామస్థులు

మధ్యాహ్న భోజనం సరిగా లేదని విద్యార్థుల ఆందోళన

ధర్మపురి, సెప్టెంబరు 9: మండలంలోని ఆరెపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో మధ్యాహ్న భోజనం సక్రమంగా అందించడం లేదని విద్యార్థులు సోమవారం ఆందోళన చేపట్టారు. ప్రతి రోజు మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండటం లేదని పిల్లలు ఆందోళన చేసి పాఠశాల నుంచి వెళ్లిపోయారు. వంటలో పురుగులు, వెంట్రుకలు ఉన్నా అలానే వండి వడ్డిస్తున్నారని విద్యార్థులు వాపోయారు. వంట మనుషులు తమకు వద్దంటూ విద్యార్థులు తెలిపారు. వారిద్దరూ పాఠశాలలో ఉంటే తాము పాఠశాలలోకి వచ్చేది లేదంటూ విద్యార్థులు ఇంటికి వెళ్లిపోయారు. సమస్య పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆయన అవయవాలు సజీవం

● రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

● అవయవదానానికి ముందుకు వచ్చిన కుటుంబీకులు


నాగరాజు(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 9: తనువు చాలించినా అవయవ దానంతో ఆరుగురి జీవితాల్లో వెలుగులు నింపాడు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లికి చెందిన మారెల్లి నాగరాజు (43) ఎంఏ, ఎంఎడ్ పూర్తి చేసి స్థానికంగా వ్యవసాయం చేస్తూ పాడి గేదెల పెంపకంతో కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. ఈ నెల 5న ఎల్లారెడ్డిపేట శివారులోని కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తలకు బలమైన గాయలవడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మూడు రోజుల పాటు నాగరాజు చికిత్స పొందాడు. ఆదివారం రాత్రి పరీక్షించిన వైద్యులు బ్రెయిన్ డెడ్ అయినట్లు నిర్ధారించారు. కుటుంబ పెద్ద దూరమైనా ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపాలని భావించిన కుటుంబ సభ్యులు అవయవదానం చేసేందుకు ముందుకొచ్చారు. జీవన్‌దాన్ సంస్థ ద్వారా కళ్లు, గుండె, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, కాలేయం సేకరించారు. అక్కడి ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది నాగరాజు పార్థివదేహం వద్ద గౌరవ వందనం చేశారు. అనంతరం అంబులెన్స్‌లో స్వగ్రామానికి తరలించారు. నాగరాజు బీఆర్‌ఎస్ కార్యకర్తగా కొనసాగేవాడు. గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులు, యువకులు భారీ ప్రదర్శన నిర్వహించారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, స్థానిక నాయకులు నాగరాజు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి పాడె మోశారు. మృతుడికి తల్లి అనసూయ, భార్య వసుధ, రెండేళ్ల వయసు ఉన్న కొడుకు శశ్వ ఉన్నారు. తల్లి అనసూయ ఫిర్యాదు మేరకు రోడ్డు ప్రమాదానికి కారణమైన మండలంలోని కోరుట్లపేటలోని ఆటోడ్రైవర్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 9: ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులోని కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై సోమవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయంలో నివాసం ఉంటున్న వ్యక్తి అలకుంట పాపయ్య తీవ్ర గాయాలపాలయ్యాడని పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. క్షతగాత్రుడిని 108 వాహనంలో సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పాపయ్య సైకిల్‌పై ఎల్లారెడ్డిపేట బస్టాండు ప్రాంతం నుంచి గ్రామ శివారులోని డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయం వైపునకు వెళుతున్నాడు. ఎల్లారెడ్డిపేట నుంచి గొల్లపల్లి వెళుతున్న కారు అతివేగంగా వెనుక నుంచి ఢీకొట్టింది. సమాచారం అందుకున్న ఎస్‌ఐ రమాకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు.

అడవిలో చెట్ల నరికివేత

● 8 మందిపై కేసు నమోదు

వీర్నపల్లి, సెప్టెంబర్ 9: వీర్నపల్లి మండలం వన్‌పల్లి గ్రామంలోని కొచ్చ గుట్ట బోరు, అందుగు చెట్టు బయిలు, కొమటి కుంట్ల ప్రాంతాల్లోని అడవిలో కొన్ని రోజులుగా చెట్లు నరికివేతకు గురవుతున్నాయి. పోడు భూములు సాగు చేసేందుకు సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలో అటవీ చెట్లను కొందరు దుండగులు నరికేశారు. ఓ వైపు ప్రభుత్వం హరితహారంలో చెట్లు నాటాలని చెబుతుంటే కొందరు అక్రమార్కులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. వారి సొంత లాభం కోసం అటవీ సంపదను ధ్వంసం చేస్తున్న ఫారెస్ట్ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. గర్జనపల్లి సెక్షన్ పరిధిలోని పలు గ్రామాల్లో సిబ్బంది పోడు భూముల సాగుకు ఎకరానికి సుమారు లక్షకు పైగా ముడుపులు తీసుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ పోడుభూమి సాగుకు తము చెప్పిన ట్రాక్టర్‌నే వాడాలని చెప్పడం కొసమెరుపు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్థులు కోరారు.



అటవీభూమిలో నరికివేసిన చెట్లు

వన్‌పల్లిలో చెట్ల నరికివేత విషయంపై ఫారెస్ట్ సెక్షన్ అధికారి ఆయూబ్ ఖాన్ ను ఫోన్ ద్వారా వివరణ కోరగా అటవీ చెట్లను నరికిన విషయం తమ దృష్టికి వచ్చిందని, చెట్లను నరికింది ఎవరనే విషయంలో విచారణ చేసి 8 మంది పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అటవీ సంపదను ధ్వంసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వినాయక మండపాల వద్ద ప్రత్యేక పూజలు



కోరుట్లలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో గణపతికి ఉంజల్ సేవ



ధర్మపురి నిత్యాన సత్రం వద్ద లక్ష గరకార్చణ పూజలు



మెట్‌పల్లిలో వినాయకుడికి ఉంజల సేవ నిర్వహిస్తున్న నాయకులు

కోరుట్ల, సెప్టెంబరు 9 : పట్టణంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు శోభయమానంగా జరుగుతున్నాయి. పట్టణంలోని అర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవి క్లబ్ సభ్యులు గణపతికి ఉంజల్ సేవ నిర్వహించి వేడుకలను జరిపారు. గోడవాడకు చెందిన యువసేన యూత్ సభ్యులు ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద పుట్టిన బిడ్డకు పోలీయో చుక్కలు వేయించాలని అవగాహన చేస్తుడడం ఆకట్టుకుటుంది. అల్లమయ్య గుట్ట ప్రాతంలోని యువజన సంఘ సభ్యులు ప్లాస్టిక్ పైపులతో గణపతిని తయారు చేశారు. బిలాల్‌పురలోని స్రేహయూత్ ఆధ్వర్యంలో ఎండు కొబ్బరితో గణపతి విగ్రహాన్ని తయారు చేశారు.

●అమర్నాత్ యాత్రలో శివుడిని దర్శించుకోవడానికి భక్తులు ప్రతి ఏటా భారీ సంఖ్యలో వెలుతుంటారు. నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పట్టణంలోని రవీంద్ర రోడ్డులో నవతరం యూత్ సభ్యులు వినూత్న రీతిలో గణపతి శివ లింగాన్ని తయారు చేసి వేడుకలను నిర్వహిస్తున్నారు. యూత్ సభ్యులు ఏసీ రిపేరర్ శని గారపు రాజేష్, బింగి శ్రీకాంత్ టెక్నిషన్, సభ్యులు నవీన్, రవి కా ఫర్‌తో తయారు చేసి ఏసీ అవుట్ డోర్ కనెక్షన్ అందించారు. దీంతో గణపతితో పాటు శివ లింగం పూర్తిగా మంచుగా మారి తండ్రి శివుడికి గణపతి అభిషేకం చేస్తున్నట్లుగా తీర్చిదిద్దారు. అమర్నాత్ మంచు కొండలో శివుడు గణపతిని దర్శిం చుకున్నట్లు తీర్చిదిద్దారు. యూత్ సభ్యులు చేసిన ప్రయోగం ఆకట్టుకుంది.


జగిత్యాల అర్బన్ : జిల్లా కేంద్రంలో వివిధ ఆకృతుల్లో పలు మండపాల వద్ద ఏర్పాటు చేసిన వినాయకులు భక్తులను, ప్రజలను అమితంగా అకర్షిస్తు న్నాయి. మండపాలకు సరికొత్త హంగులను అద్దాగా చూపరులను అకర్షిస్తున్నా యి. పట్టణంలోని బైపాస్ రోడ్‌లో గల 52 అడుగుల గణనాథుని విగ్రహంను చూసేందుకు భక్తులు గుమిగూడుతున్నారు. వాణీనగర్‌లోని త్రిశూల్ యూత్ ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన 40 అడుగుల వినాయక విగ్రహంతో పాటు 60ఏళ్లుగా మార్కండేయ ఆలయంలో ఏర్పాటు చేస్తున్న మట్టి గణపతుల రూపాలు చూపరులను విశేషంగా అకట్టుకుంటున్నాయి.

కథలాపూర్: మండల కేంద్రంలో మంగళవారం శివపార్వతుల కల్యాణం ఘనంగా జరిగింది. వినాయక నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని యంగ్‌స్టార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం పండితులు ప్రమోద్‌శర్మ నేతృత్వంలో వైభవంగా నిర్వహించారు. భూషణరావుపేటలో విఘ్నేశ్వర యూత్ భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించింది.

మెట్‌పల్లి(ఇబ్రహీంపట్నం) : నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని వాసవి గార్డెన్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వినాయక మండపం వద్ద ఉంజల సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు మైలారపు లింబాద్రి-లక్ష్మీ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షులు మైలారపు రాంబాబు-సంతోషిణి, కోట కిరణ్, చాడ సురేష్ పాల్గొన్నారు.



జగిత్యాల కృష్ణానగర్‌లో కాల భైరవ రూపంలో గణనాథుడు.



జగిత్యాల బైపాస్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన బాల గణపతి

కొడిమ్యాల : మండల కేంద్రంలోని సాయినగర్‌లో యువకులు ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద సోమవారం గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. వినాయక మండపం వద్ద నిర్వహకులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రవిశంకర్, మాజీ ప్రజాప్రతినిధులు ప్రభాకర్‌రెడ్డి, రాజేశ్వరీరాజేందర్, బీఆర్ఎస్ నాయకులు వెంకటేష్‌గౌడ్, వెంకటి, చంద్రశేఖర్, శుకూర్, స్వామి పాల్గొన్నారు.

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలోని పలు వీధుల్లో నెలకొల్పిన వినాయక మండపాల్లో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. స్థానిక ఆర్యవైశ్య నిత్యాన్న సత్రంలో నెలకొల్పిన వినాయ మండపంలో గణనాథుడికి లక్ష గరకార్చణ నిర్వహించారు. ఉపవాస దీక్షతో ఉన్న భక్తులు గణనాథుడికి రక రకాల పిండి పదార్థాలు తయారు చేసి నైవేద్యం సమర్పించారు. సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐ గంగుల మహేష్, పోలీస్ సిబ్బంది ప్రత్యేక పర్యవేక్షణ జరిపారు.

వెల్గటూర్: గణేష్ నవరాత్రుల్లో భాగంగా మూడవ రోజు మండలంలో సోమవారం వినాయకుడికి విశేష పూజలు నిర్వహించారు. వినాయక మండపాల వద్ద భక్తులు అర్చన చేయించుకున్నారు. కొన్ని చోట్ల నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వెల్గటూర్‌లో వీరా నానీ యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయకుడికి పీసీసీ సభ్యుడు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మెరుగు మురళి, సందీప్‌రెడ్డి, నరేష్, గంగయ్య, తిరుమల్ పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలు ఇప్పించాలని కలెక్టర్‌కు వినతి

కథలాపూర్, సెప్టెంబరు 9 : ఎన్నో ఏళ్ళుగా తాము సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని మండలంలోని పలు గ్రామాల గిరిజన తండావాసులు మంగళవారం కలెక్టర్ సత్యప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు గత ప్రభుత్వం తమకు పట్టాలు ఇస్తామని చెప్పి 400 ఎకరాలకుగాను కేవలం ఎకరం మాత్రమే పట్టా ఇచ్చారని పేర్కొన్నారు. పోడు భూములు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నందు వల్ల పట్టా ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. సర్వేలు నిర్వహించి అర్హులైన వారికి పట్టాలు ఇవ్వాలని 9 గిరిజన తండాలకు చెందిన గిరిజనులు కోరారు

బలరామ విగ్రహ ప్రతిష్ఠాపన

మల్లాపూర్, సెప్టెంబరు, 9 : భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రం శివారులోని రైతు వేదిక వద్ద బలరామ విగ్రహాన్ని నాయకులు ప్రతిష్ఠించారు. భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు రంగారావుతో పాటు పలువురు నాయకులు, రైతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు, 9 : మూగజీవాలకు వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా వ్యాధి నిరోధక టీకాలను వేయించాలని మండల వైద్యాధికారి డాక్టర్ మనీషాపటేల్ సూచించారు. పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని చౌలమద్ది గ్రామంలోని మేకలు, గొర్రెలకు ఉచితంగా వ్యాధి నివారణ టీకాలను వేసి పశుపోషకులకు అవగాహన కల్పించారు.

చలో కరీంనగర్ కరపత్రం ఆవిష్కరణ

భీమారం, సెప్టెంబరు 9: ఎస్సీ వర్గీకరణ సాధించడంతో అమరులను తలుచుకుంటూ కరీంనగర్‌లోని ఇందిరా గార్డెన్‌లో ఈ నెల 10న నిర్వహించనున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాదిగల ఐక్య వేదిక సదస్సు కరపత్రాన్ని టీఎమ్మైఎస్ మండల అధ్యక్షుడు బంగారు దీపక్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. భీమారం, మేడిపల్లి మండలాల నాయకులు అధిక సంఖ్యలో తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వెంకటేష్, డప్పు ప్రేమ్ సాగర్, సీనియర్ నాయకుడు శంకర్, పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

మెట్‌పల్లి, సెప్టెంబర్ 9(ఇబ్రహీంపట్నం) : పట్టణంలోని మహాజన్ గార్డెన్‌లో సోమవారం లయన్స్ క్లబ్ మెట్‌పల్లి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కరీంనగర్ రేకుర్తి వైద్యులు దాదాపుగా 300 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఇల్లెందుల శ్రీనివాస్ తెలిపారు. 300 మందికి పరీక్షలు నిర్వహించగా 40 మందికి అపరేషన్ నిమిత్తం కరీంనగర్ రేకుర్తి అసుపత్రికి తరలించినట్లు ఆయన తెలి పారు. లయన్స్ క్లబ్ సెక్రటరీ గూండా రాకేష్, క్యాషియర్ నాంపల్లి వేణుగోపాల్, గడ్డం శంకర్‌రెడ్డి, రాజేశ్వర్‌గౌడ్, భాస్కర్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో స్వచ్ఛత పక్వాడ

పెగడపల్లి, సెప్టెంబరు 9 : మండలంలోని పలు గ్రామాలలోని ప్రభుత్వ పాఠ శాలల్లో సోమవారం స్వచ్ఛత పక్వాడ నిర్వహించారు. పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు గాను చేతులు శుభ్రంగా ఎలా చేసుకోవాలో వివరించి విద్యార్థినీ విద్యార్థుల చేత చేయించారు. కార్యక్రమాలలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కథలాపూర్ : చేతులను శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచే రవని జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి కె. మహేశ్ సూచించారు. మండలంలోని సిరికొండ పాఠశాలలో పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా ఆకస్మికంగా తనిఖీ చేశారు. పా ఠశాల పరిసరాలను పరిశీలించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు లోకిని శ్రీనివాస్, వసంత, ఉపాధ్యాయులు విష్ణు, రవి ఉన్నారు.

ఘనంగా పోషణ మాస వేడుకలు

గొల్లపల్లి, సెప్టెంబరు 9: మండలంలోని ఇబ్ర హీం నగర్ సెక్టార్ పరిధి లోని రాఘవపట్నం అంగన్ వాడీ కేంద్రంలో సోమవారం పోషణ మాస వేడుకలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం గురించి వివరించారు. అంగన్ వాడీ టీచర్లు రమాదేవి, రమాదేవి, స్వప్న, జలజ పాల్గొన్నారు.

అయోధ్య రాముని కండువాల పంపిణీ

కొడిమ్యాల, సెప్టెంబరు 9 : మండల కేంద్రంలోని పురాతన సీతారామచంద్రస్వామి ఆలయంలో సోమవారం శ్రీ రామ తీర్థ క్షేత్ర ట్రస్ట్ అక్షింతల కమిటీ సభ్యుడు మంచాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముని కండువాలను, రాముని చిత్ర పటాలను భక్తులకు పంపిణీ చేశారు. రామభక్తులు రామస్వామి, దేవెందర్, ఆదిరెడ్డి, నారాయణ, జనార్దన్, రమేష్, రాంచంద్రం, శ్రీనివాస్, శ్రీధర్ ఉన్నారు.

దుబ్బరాజన్న ఆలయ హుండీ లెక్కింపు

సారంగాపూర్, సెప్టెంబరు, 9: ప్రముఖ పుణ్యక్షేత్రమైన రాజరాజేశ్వర స్వామి ఆలయ హుండీ సోమవారం లెక్కింపు జరిపారు. గత ఆరు మాసాల నుండి రూ, 14,26,813ల ఆదాయం వచ్చింది. ఈ లెక్కింపును దేవదాయ శాఖ జగిత్యాల డివిజన్ పరిశీలకులు రా జమౌళి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పౌండర్ పొరండ్ల శంకరయ్య, నాయకులు కోండ్ర రాం చందర్‌రెడ్డి, కోల శ్రీనివాస్, వాసం శ్రీనివాస్, గురునా థం మల్లారెడ్డి, తోడేటి శేఖర్‌గౌడ్, చిందం శ్రీనివాస్, సేవ సమితీ ససభ్యులు, వాటీంటర్లు, గ్రామ పెద్దలు జూనియర్ అసిస్టెంట్ రజినికాంత్ పాల్గొన్నారు.

డిటోనేటర్ల గోదాంకు అనుమతి ఇవ్వొద్దు

బుగ్గారం, సెప్టెంబరు 9: బుగ్గారం గ్రామంలో నిర్మించతలపెట్టిన డిటోనేటర్ల గోదాంకు అనుమతులు ఇవ్వకుండా పూర్తి స్థాయిలో రద్దు చేయాలని కోరుతూ సోమవారం బుగ్గారం గ్రామస్తులు విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు, కలెక్టర్ సత్య ప్రసాద్‌కు సోమవారం వినతి పత్రం సమర్పించారు. వీడీసీ, ఎండీసీ ఆధ్వర్యంలో విప్‌ను కలిసి గోదాం నిర్మాణానికి అనుమతులు ఇవ్వకుండా చూడాలని కోరగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. వీడీసీ కోర్ కమిటీ చైర్మన్ చుక్క గంగారెడ్డి, వీడీసీ అధ్యక్షుడు నక్క చంద్రమౌళి, రాజిరెడ్డి, రాగన్న పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

కోరుట్ల, సెప్టెంబరు 9 : జగిత్యాల జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు వకీలు కుటుంబంను సోమవారం జగిత్యాల జిల్లా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పరామర్శించారు. వకీలు తల్లి అనారోగ్యంతో మృతి చెందంగా అయన కుటుంబంను ఎమ్మెల్యే పరామర్శించి సంతాపం ప్రకటించారు. ఎమ్మెల్యే వెంట టీఎస్‌సీఓ జిల్లా నాయకుడు నరేందర్ రెడ్డి ఉన్నారు.

పోషణ మాసం ఉత్సవాల్లో ప్రజలందరినీ భాగస్వామ్యులు చేయాలి

కలెక్టర్ సత్య ప్రసాద్

జగిత్యాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పోషణ్ అభియాన్ కార్యక్రమాల్లో ప్రజలందరినీ భాగస్వామ్యులను చేయాలని కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు. సోమవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీ వరకు జిల్లాలో నిర్వహిస్తున్న పోషణ మాసోత్సవ కార్యక్రమాల్లో భాగంగా రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్య ప్రసాద్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈకార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాంబాబు, గౌతమ్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి బోనగిరి నరేశ్, పలువురు ఐసీడీఎస్ సీడీపీవోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహించుకోవాలి

ఎస్పీ అశోక్ కుమార్



ప్రత్యేక పూజలలో పాల్గొన్న ఎస్పీ అశోక్ కుమార్

కోరుట్ల, సెప్టెంబరు 9 : భక్తి శ్రద్ధలతో గణపతి నవరాత్రి ఉత్సవాలను నిర్వహించుకోవాలని ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని వివిధ ప్రాంతాలలోని గణపతి మండపాలను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచలను సలహాలను అందించారు. మండపాల వద్ద డీజే సౌండ్స్, మైక్‌లు వినియోగించి ప్రజలకు ఇబ్బందుల పాలుకాకుండా చూడాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించి ఉత్సవాలను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ బాబు, ఎస్ఐ శ్రీకాంత్, ఎస్బీ, డిస్టిక్ గార్డు, పోలీసు సిబ్బందితో పాటు మండపాల నిర్వహకులు పాల్గొన్నారు.

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి

మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్ రావు

కోరుట్ల, సెప్టెంబరు 9 : క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని, గెలుపోటములను క్రీడ స్పూర్తితో స్వీకరించాలని మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఎఆర్ డీఎస్పీ శశిధర్ స్మారక వాలీబాల్ ఇన్విటేషన్ టౌర్నమెంట్ ముగింపు సమావేశంలో పాల్గొన్ని విజేతలకు బహుమతులను అందించారు. టౌర్నమెంట్ మెన్ విభాగంలో ఎస్ఆర్ ఆర్ కరీంనగర్, కోరుట్ల జట్టు ఫైనల్ జరుగగా కోరుట్ల జట్టు విజయం సాధించింది. చింతకుంట కరీంనగర్ ఏ టీం, బీ టీంలు చింతకుంట జట్టుతో తలపడగా చింతకుంట జట్టు విజయం సాధించండంతో విజేతలకు డీఎస్పీ బహుమతలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల సిర్కిల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ బాబు, ఎస్ఐ శ్రీకాంత్, టౌర్నమెంట్ ఆర్గ నైజర్స్ బారీ, గంగాధర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఏకగ్రీవం

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 9: జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) జిల్లా నూతన కమిటీ ఎన్నికైనట్లు రాష్ట్ర పరిశీలకులు గడిపల్లి నర్సయ్య తెలిపారు. జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో జరిగిన ఎన్నికల్లో జిల్లా అధ్యక్షునిగా బాజోజి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా చౌడారపు రాంప్రసాద్, పాత శ్రీనివాస్, అడువాల రవి, పుప్పాల నాగన్న, బందరుకంటి శ్రీనివాస్, గుంటుక సురేష్, ప్రవీణ్ ప్రధాన కార్యదర్శిగా బడే శ్రీనివాస్, కోశాధికారిగా లకుమల్ల సత్తయ్య, కార్యదర్శులుగా దీకొండ రవి, గన్నారపు నరసింహామూర్తి, గుగ్గిల్ల నర్సయ్య, దాసరి జయంత్, అరకాల శ్రీనివాస్, ముద్దసాని కరుణాకర్, గౌరవాధ్యక్షులుగా మార్గం రాజేంద్రప్రసాద్, బాస రాములు, ఆకుల లక్ష్మీనర్సయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ రెండేళ్ల కాలం పాటు పనిచేస్తుందన్నారు.

అణగారిన వర్గాలకు దూరంగా విద్య

మల్యాల, సెప్టెంబరు 9: విద్యారంగం పూర్తిగా కార్పొరేట్, పెట్టుబడిదారుల చేతుల్లోకి వెలుతుండంతో వ్యాపారమయంగా మారిన విద్య అణగారిన వర్గాలకు అందని ద్రాక్షల మారిందని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అంగడి కుమార్ అన్నారు. మల్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం పీడీఎస్‌యూ 50 వసంతాల సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాలకులు అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేఖ విధానాలపై పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. స్వతంత్రం వచ్చాక దేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం, మైనారిటీ, పీడిత వర్గాలకు ఉచిత విద్య, వైద్యం అందించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆవేధన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాజు, మహేశ్, శ్రీనివాస్, రాజేశ్ పాల్గొన్నారు

నేనూ రైతునే.. రైతుల కష్టాలు తెలుసు..

●గోదాంల ఏర్పాటుకు కృషి ●ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి



సహకార సంఘాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

రాయికల్, సెప్టెంబరు 9: 'స్వతహాగా.. తాను కూడా వ్యవసాయం చేస్తూ ఉంటానని, రైతుల కష్టాలు తనకు తెలుసు, సాగు రంగంలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయని, రైతులు వాటిని అందిపుచ్చుకొని రాణించాలని ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి సూచిం చారు. రాయికల్ మండలంలోని అల్లీపూర్ గ్రామంలో అల్లీపూర్ రైతుమిత్ర ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ అనే సహకార సంఘాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ రైతుగా తనకు రైతుల కష్టాలు తెలుసునని, వాటి పరిష్కారం కోసం మండలిలో గళమెత్తుతానని చెప్పారు. రైతులంతా సమష్టిగా సంఘాన్ని ఏర్పాటు చేసుకోవడం ఎంతో మంచి పరిణామమన్నారు. ప్రభుత్వం గోదాంలను ఏర్పాటు చేస్తే రైతులకు ఎంతగానో లాభం చేకూరుతుందన్నారు. రైతులు తమ విత్తనాలను తామే తయారు చేసుకుంటే బాగుంటుందన్నారు. రైతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలని, లేదంటే శాస్త్రవేత్తలకు తెలిపితే సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి రైతులకు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. త్వరలో పెట్టుబడి సాయం అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపి రాజరెడ్డి, అత్తినేని గంగారెడ్డి, మెక్కొండ రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ మోర విజయలక్ష్మివెంకటేష్, అల్లీపూర్, కిష్టంపేట, సింగ్రావుపేట, ఆలూరు, రాజనగర్, శ్రీరాంనగర్, కురుమపల్లి గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పొన్నం సత్తయ్యకు ఎమ్మెల్యే నివాళులు

జగిత్యాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, ట్రాన్స్‌పోర్టు శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తండ్రి పొన్నం సత్తయ్య గౌడ్ చిత్ర పటం వద్ద జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మా కునూరి సంజయ్ కుమార్ నివాళులు అర్పించారు. కరీంనగర్‌లో జరిగిన పొన్న సత్తయ్య గౌడ్ వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పాల్గొని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిశారు. పొన్న సత్తయ్య గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించా రు.

కోరుట్ల : రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ తండ్రి సత్యయ్య గౌడ్ చిత్ర పటానికి కోరుట్ల కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జు జువ్వాడి నర్సింగ రావు పూలమాల వేసి ఘన నివాళిని అర్పించారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలి

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 9 : ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలను అందించాలని జగిత్యాల జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని టీఆర్‌నగర్‌లో గల బస్తీదవాఖానాను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. జ్వరంతో భాధపడుతున్నవారికి పరీక్షలు నిర్వహించి రోగనిర్దారణ చేసి మందులను పంపిణీ చేయాలన్నారు. హాస్పిటల్‌లో వైద్యసిబ్బంది సమయ పాలన పాటించాలని, అందు బాటులో ఉండి వైద్యసేవలు అందించాలని ఆదేశించారు.

బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్‌గా పన్నాల రాఘవరెడ్డి



రాఘవ రెడ్డికి నియామక పత్రం అందజేస్తున్న సుఖేంధర్‌గౌడ్

మెట్‌పల్లి, సెప్టెంబర్ 9(ఇబ్రహీంపట్నం) :కోరుట్ల నియోజకవర్గ బీజేవైఎం కన్వీనర్‌గా మెట్‌పల్లి పట్టణానికి చెందిన పన్నాల రాఘవరెడ్డిని నియమిస్తూ బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. నియామక పత్రాన్ని పన్నాల రాఘవరెడ్డికి చెట్లపల్లి సుఖేంధర్‌గౌడ్, బీజేపీ పట్టణ అధ్యక్షులు బొడ్ల రమేష్ అందజేశారు. రాఘవరెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి అప్పజెప్పిన నిజామాబాద్ ఎంపీ అర్వింద్‌కు, జిల్లా అధ్యక్షులు సత్యనారయణకు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్‌గౌడ్,బీజేపీ పట్టణ అధ్యక్షులు బొడ్ల రమేష్‌కు, బీజేపీ, బీజేవైఎం నాయకులకు కృతజ్ఞతాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు యాదగిరి బాబు, నరేందర్‌రెడ్డి, నవీన్, శ్రీనివాస్, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

భారత సంప్రదాయాలు ప్రపంచ వ్యాప్యంగా వ్యాపిస్తున్నాయి

సామాజిక సమరస రాష్ట్ర కన్వీనర్ అప్పల ప్రసాద్

కోరుట్ల రూరల్, సెప్టెంబరు 9 : ప్రపంచ వ్యాప్తంగా భారత సంస్కృతి సంప్రదా యాలు వ్యాపిస్తున్నాయని సామాజిక సమరస రాష్ట్ర కన్వీనర్ అప్పల ప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని జోగినిపల్లి గ్రామంలో వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కుటుంబ సమ్మేళన కార్యక్రమం నిర్వహించగా సామాజిక సమ రసతా రాష్ట్ర కన్వీనర్ అప్పల ప్రసాద్ పాల్గొన్నాడు. ఈ సందర్భంగా అప్పల ప్రసాద్ మాట్లాడారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను మన దేశ సంస్కృతి సంప్రదాయాలు చాటుతాయని అన్నారు. హిందువుల ఐక్యత చాటే విధంగా మనం ఐక్యమత్తంగా ఉండి దేశ వ్యాప్తంగా మన ఐక్యమత్యం చాటాలని అన్నారు. గ్రామానికి విచ్చేసిన సామాజిక సమరసతా రాష్ట్ర కన్వీనర్ అప్పల ప్రసాద్‌ను గ్రామస్థులు అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల సమరసత అధ్యక్షుడు కనికరపు రాజేశం, జిల్లా అధ్యక్షుడు చిట్ల గంగాదర్, కర్నాకర్ రావు, గ్రామస్థులు దుంపాల రాజనర్సయ్య, తిరుపతి రెడ్డి, ఏలేటి మహిపాల్, బల్వంతరెడ్డి, నర్సింహులు, జలంధర్, స్వామిరెడ్డి, ప్రశాంత్, గంగా నర్సయ్య, భూమ్ రెడ్డి, రాజేంధర్, అమర్, రాకేష్ పాల్గొన్నారు.

ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు



కోరుట్లలో నివాళులు అర్పిస్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది

కోరుట్ల, సెప్టెంబరు 9 : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం కాళోజీ నారాయణరావు గారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాళోజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లను మున్సిపల్ అధికారులు, సిబ్బంది అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ తిరుపతితో పాటు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొడిమ్యాల : మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో, మండలంలోని తిర్మాలాపూర్ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రజాకవి కాళోజీ నారాయణరావు చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కె. వేణు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ తిరుపతి, అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. తిర్మాలాపూర్ పాఠశాలలో ప్రశధానోపాధ్యాయురాలు జ్యోత్స్నదేవి పాల్గొన్నారు.

పెగడపల్లి : కాళోజీ జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెగడపల్లి ఉన్నత పాఠశాలలో మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమాలలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంఈవో శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాయికల్: మండలంలోని ఇటిక్యాల ప్రభుత్వ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో సోమవారం కాళోజీ నారాయణ రావు జయంతిని పురస్కరించుకుని తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వివిధ తరగతుల విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహన్, తెలుగు భాషా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాయికల్: మన తెలంగాణ ప్రాంత యాసను, భాషను కాపాడిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు అని పాఠశాల సముదాయం ప్రధానోపాధ్యాయుడు కాపు శ్రీనివాస్ అన్నారు. రాయికల్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం కాళోజీ జయంతి వేడుకలు నిర్వహించారు. రాజేశం, పి.రాజశేఖర్, చెరుకు మహేశ్వర శర్మ, ప్రశాంత్, పద్మ, తరంగిణి పాల్గొన్నారు.